
# నేలా - నింగీ



సుందరానికి అలిపిరి గాలిగోపురం అందుకోవలసిన ఆదర్శంలా కనిపిస్తూ ఉండేది. అప్పట్లో అతడు హైస్కూల్లో చదువుకునే కొంటె విద్యార్థి. కొత్తగా కొండపైకి రహదారి వేసిన రోజులు. బస్సుల్లో వెళ్తే రావలసినంత పుణ్యం రాదేమోనని యాత్రికుల్లో ఎక్కువమంది మెట్ల వెంబడే వెళ్తుండేవాళ్ళు. ఎత్తయిన కొండపైన ఠీవిగా నిలబడి, అలిపిరి గాలిగోపురం సుందరాన్ని కవ్విస్తుండేది. ప్రతి సాయంకాలమూ అదొక హేలగా చెంగుచెంగున ఎగురుతూ కొండ మెట్లెక్కి పోయేవాడు. ఎంతెంత ఎత్తుగా వెళ్తే అంతంతగా సుదూర ప్రాంతాలు కనుల పండువుగా కనిపించేవి. వానాకాలంలో కుంటలు, చెరువులు నిండినప్పుడైతే ఆ పరిసర ప్రాంతమంతా సంతలో తిరుగు దాసరివాడి అద్దాల దుకాణంలా కానవచ్చేది. ప్రొద్దు గ్రుంకేదాకా గాలిగోపురం దగ్గర కూర్చుండిపోయేవాడు సుందరం. చెట్లతో, పొదరిళ్ళతో, సెలయేళ్ళతో, మాటిమాటికీ క్రిందికి జారివచ్చే మబ్బుతెరలతో అదొక కొండల రాజుమేడ. తన ఇష్టం వచ్చినంతసేపు తానా మేడలో విడిది చేయవచ్చు. అడిగేవాళ్ళు లేరు. సుందరానికి చాలా ఆనందంగా ఉండేది.

ఆ అందానికి దాదాపుగా పాతికేళ్ళు దూరమై ఉండిపోయాడు సుందరం. మురికి పేటల్లో నివసించాడు. పైకి చూస్తే ఆకాశం, ప్రక్కలికి చూస్తే జనం, కిటకిటలాడే ఇరుకైన ఇండ్లు, క్రిందికి చూస్తే సైదుకాలువలు. ముక్కులు మూసుకోకపోతే దుర్గంధం. జీవితాశయం నుంచి వంచింపబడిన శాపగ్రస్తుడిలా నిట్టూర్పులు నిగుడిస్తూ కాలం వెళ్ళదీసిన సుందరానికి వరప్రసాదంలా ఓ కాగితం చేతికొచ్చింది. మరేం లేదు. అది ప్రమోషను. సుందరానికి ఆమందానందం కలిగినందుకు అదొక్కటే కారణం గాదు. ప్రమోషను మూలంగా వచ్చిన బదిలీ తిరుపతికే వచ్చింది. అంటే ఏమన్న మాట? అది కోరిన కొండలో కురిసిన వాన!

తిరుపతికి వచ్చి ఉద్యోగంలో జాయినైన సాయంకాలమే కొండవైపు వెళ్ళాడు. ఈనాటి తిరుపతి చిట్టడవుల్ని కబళిస్తూ కొండవైపు బారలు చాస్తూ ఉండడం గమనించి నొచ్చుకున్నాడు. ఇలాగే కొన్ని దశాబ్దాలు గడిస్తే మానవ నాగరికత తాకిడికి ప్రకృతి సౌందర్యం ఏమాత్రం మిగిలేటట్టు లేదు.

కానీ కొండ వైపు చూచే సరికి సుందరం హృదయంలో ఉత్సాహం ఉరకలు వేసింది. అలిపిరి కనిపించేసరికి అంతై, ఇంతై, ఇంతింతై తాను మళ్లీ ఒకసారి చిన్నవాడై పోయినట్టు, ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకొచ్చింది. ఆ ఉత్సాహంలో అతడు అవలీలగా పదిమెట్లు ఎక్కేశాడు. అయితే అతడిప్పుడు అవలీలగా ఎక్కగలిగింది పదిమెట్లు మాత్రమే. పదకొండో మెట్టు దగ్గరికి వచ్చేసరికి కాస్తా మెల్లగా ఎక్కితేనే బాగుండు ననిపించింది. ఎంత మెల్లగా అడుగులు వేసినప్పటికీ మరికొన్ని మెట్టెక్కే సరికి ఆయాసం ముంచుకొచ్చింది. మోకాళ్ళు నొప్పులెత్తడం ప్రారంభమైంది. అసురుసురై పోయిన సుందరం యాభయ్యో మెట్టు దగ్గర కూలబడిపోయాడు. అయిదు నిమిషాల వరకూ అలాగే గసబోసుకుంటూ కూర్చున్నాడు. ఇంకొక అంచెలో ఇంకొక యాభై మెట్లు. మరైతే అలా ఎన్ని అంచెలు దాటితేనో అలిపిరి. నిజానికి యాభయ్యో మెట్టుదాటి పైకి వెళ్ళనే లేదు సుందరం. అందుకో కారణం ఉంది. అదేమిటంటే కపిలతీర్థం దగ్గర మలుపు తిరిగి కొండకు సమాంతరంగా



దాదాపు నాలుగు వందల కథలు రాసిన సుప్రసిద్ధ రచయిత **మధురాంతకం రాజారాం** ఇటీవల కన్నుమూశారు. ఆయన రచనా వైశిష్ట్యాన్ని, కథా సంవిధానాన్ని ప్రతిఫలించే ఈ కథను ఆయనకు నివాళిగా అందజేస్తున్నాం. పాతికేళ్ళ కిందట ఆయన రాసిన ఈ కథ మధ్యతరగతి జీవితంలోని చిరుమందహాసాలకు, అలకలకు ప్రతీక !!

వస్తున్న రోడ్డుకు ప్రక్కగా, రూయా హాస్పిటలుకు గూడా రెండు ఫర్లాంగుల దూరంలో అతడికొక మేడ కనిపించింది. ప్రశాంతతే రాజ్యమేలుతున్న నిర్జీవ ప్రదేశంలో ఒక చిన్నమేడ? చుట్టూ ప్రాకారం. ముందు వైపుగా వసారా. మిద్దెపైన ఒకటో రెండో గదులు. ఈ కొండ, ఈకోన, ఈ సోపానపంక్తీ, ఈ అలిపిరి గాలిగోపురం ఇవన్నీ కనిపించేటట్లుగా మిద్దెపైన గదులకు కిటికీలు గూడా ఉన్నాయి.

'ఎవరు కట్టించిరో ఆ చిన్నమేడ' అనుకున్నాడు సుందరం! ఎవరు కట్టించినా, అది తనబోటివాడు కాపురముండడానికేనని గూడా అనుకున్నాడు. పుట్టి భూమిపైన బ్రతుకుతున్నందుకు ఇలాంటి సుందరసీమకు దగ్గరగా ఉండగలిగితేనే మానవజన్మకు సార్థక్యమనుకున్నాడు. రేపో, మరునాడో లారీలో సామాన్లొచ్చేస్తాయి. అమాంతంగా ఇంటిని "డెకరేట్" చేసి పారెయ్యాలి. పది పదిహేను రోజుల్లో పిల్లల్ని వెంటబెట్టుకుని రాజ్యం వస్తుంది. అమాంతంగా ఆమెను ఈ ఇంటికి తీసుకొచ్చి ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి చేసెయ్యాలి.

సుందరం ఆ మధురోహలో పులకించి పోతుండగానే మెట్ల పొడుగునా వేసి ఉన్న విద్యుద్దీపాలు వెలిగాయి...

ఎలాగైనా సిద్ధసంకల్పుడు సుందరం. అన్నీ అతడనుకున్నట్టే జరుగుతూ వచ్చాయి. విదేశాల నుంచి వచ్చిన చిత్రకారుడెవరో ఏకాంతంగా ఉండడం కోసం ఆ ఇల్లు కట్టించుకున్నాడని తెలిసింది. వెళ్తూ వెళ్తూ అతడు దాన్నొక పెద్దమనిషికి అమ్మకం చేసిపోయాడు. మళ్ళీ అంత డబ్బు పెట్టి కొనాడానికిగానీ, కనీసం అద్దెకుండడానికి గానీ ఎవ్వరూ ముందుకు రాకుండా ఉన్న ఆ ఇంట్లో సుందరం తానుంటానని చెప్పేసరికి ఇంటి యజమాని విస్తుపోయాడు.

ముందుగా జాబు వ్రాసి, బస్‌స్టాండులో దిగిన భార్యాబిడ్డల్ని టాక్సీలో తీసుకొస్తున్నాడు సుందరం. టాక్సీ ఓరియంటల్ కాలేజీ దాటి, పాలిటెక్నిక్ కళాశాల కట్టడాలు దాటి కపిలతీర్థం ఛాయలకు రాగానే అడిగింది రాజ్యం – "ఏమండీ? మనం కాపురముండడానికి కొండపైన కాటేజీ ఏదైనా చూశారా?" అని.

"లేదు లేదు రాజ్యం? కొండ కిందనే మన కాపురం" అన్నాడు సుందరం.

కారియర్‌లో తెచ్చుకున్న భోజనంతో ఆ పూట గడి

చిపోయింది.

వర్షం కోసం ముఖం వాచిపోయి ఉన్న తిరుపతిలో అప్పటికొక నెల రోజుల నుంచీ అడపాదడపా వానజల్లులు పడుతున్నాయి. ఆ రోజు ఉదయం నుంచీ ఒకటే చిత్తడి వాన, చీకటి పడింది, కొండ మెట్ల దీపాలు వెలిగాయి.

"చూచావా రాజ్యం!" అన్నాడు సుందరం. "రాత్రి వేళ ఈ కొండవైపు చూస్తే పద్మావతీదేవి పడుకున్నట్టుంది. కొండమెట్ల దీపాల వాలు ఆమె వేసుకున్న పూలజడలా కనిపిస్తుంది. వేల కొలది దీపాలతో వెలిగిపోతున్న అలిపిరి గాలి గోపురమే జడబిళ్ళ, క్రింది గోపురాన్ని జడకుచ్చులనుకోవచ్చు. ఏమంటావు రాజ్యం? అద్భుతమైన దృశ్యం కదూ?"

రాజ్యం భయంగా కొండవైపు చూచింది.

అంతలో వినీల జలదాలు కొన్ని ఒక్కుమ్మడిగా వచ్చి కొండపైన విరుచుకపడసాగాయి.

"ఏమండీ! పద్మావతీదేవి ఏమయ్యేటట్టు?" అంది రాజ్యం.

"మరేం భయపడొద్దులే రాజ్యం! స్వామి నీల మేఘశ్యాముడు గదా! ఆయనిప్పుడు అమ్మవారి సరసకొస్తున్నాడని ఊహించుకో" అన్నాడు సుందరం.

ఆలోగా మబ్బులు చరచరా క్రిందికి దిగి వచ్చేశాయి. ఇప్పుడు కొండలో సగానికి పైగా మబ్బుల చాటున మాటుపడిపోయింది.

"శరీరచ్ఛాయ మాత్రమే కాదులెండి! మనిషి గూడా మోటువాడల్లేనే ఉన్నాడు. లేకుంటే పూలజడపైకి దొర్లుకునే వాడేనా?" తోటి ఇల్లాలి పైన జాలిపడిపోతూ అంది రాజ్యం.

అలిపిరి వెనుక మబ్బుల్లో మెరుపులు తళుక్కు తళుక్కు మంటూ మెరిసిపోతున్నాయి.

"గిలిగింతలు పెడితే నవ్వినట్టుంది గదూ?" అన్నాడు సుందరం.

"పుణ్యాత్ముడు! రాత్రంతా నిద్ర పోనివ్వమేమో గదూ! ఐనా ఇన్నిసార్లు గిలిగింతలు పెడితే ఆ ఒళ్ళేమి కావాలని?"ఉన్నట్టుండి ఆమె మాట కడ్డొచ్చాడు సుందరం.

"ఆహా, ఆహా, చూచావా రాజ్యం! ఏదీ గాలి గోపురం? ఏదీ అలిపిరి? అదృశ్యమైపోయింది. ఇప్పుడక్కడేం లేదు. కనీసం ఓ వెలుగు రవ్వయినా? ఇప్పుడు చూస్తే ఏమనిపిస్తుంది. అక్కడ వెయ్యిదీపాల అలిపిరి లాంటిదేదీ లేదనిపిస్తోంది. ఆవరించి ఉన్న కారుమబ్బే నిజమనిపిస్తుంది. "మాయ" ఎంత పని చేసిందో చూచావా రాజ్యం, ఆత్మపదార్థాన్నే కనిపించకుండా చేసింది గదూ!"

"అబ్బ, ఊరుకుందురూ! కాసేపటిక దే కనపిస్తుంది గానీ...." ఆవులిస్తూ అంది రాజ్యం.

"అదీ అదీ! ఎలాగైనా బుద్ధిమంతురాలివే? మాయ విడిపోతే ఆత్మసాక్షాత్కారమౌతుందని గ్రహించావు."

"ఈ రోజు రాత్రికిక నిద్రాదేవత సాక్షాత్కారమనేది లేకపోయిన తర్వాత ఎందుకొచ్చిన ఆత్మసాక్షాత్కారం లెండి బాబూ?"

"ఛా ఛా? ఏం నిద్ర రాజ్యం! చూడు. ఇప్పుడు మేలిముసుగులో ఎలనాగ ముఖమబింబంలా కనిపించడం లేదా అలిపిరి?

రాజ్యాన్ని కిప్పుడేమీ కనిపించడం లేదు. నిద్రపోతోంది గనుక.

మరునాటి ఉదయం రాజ్యం లేవదీసిన రకరకాల సమస్యలతో బాటుగా తెల్లవారింది. పిల్లలెలా బడికి వెళ్తారు? మార్కెట్టుకెలా వెళ్లిరావాలి? ప్రొద్దుపోకపోతే ఎవరితో మాట్లాడాలి? మగమహారాజు ఇంటి దగ్గర లేకపోతే రాత్రుళ్ళు ఎలా వేగించాలి?

"ఏముంది? కిటికీ తెరిచిపెట్టుకుని మెట్ల దారి వైపు చూస్తుంటే తెల్లవారిపోదా రాజ్యం?"

"బాబ్బాబూ! ఆ మాట నాతో చెప్పకండి. ఇంకా నయం! దివిటీ దొంగలు కొండదారిలో సాగిపోతున్నట్టుంటుంది" ముఖం ముడుచుకుంది రాజ్యం.

"అనుకుంటావు గానీ నిర్జన ప్రదేశమని! అదిగో అక్కడ కనిపించేదేగద రాజ్యం రూయా హాస్పిటల్?"

"మంచిదేలెండి! ఈ భయంతో నేనేదో రోగం కొని తెచ్చుకుంటాను. ఎలాగూ మనకిక్కడ నా అన్న వాళ్లెవరూ లేరు. ఈ పేషెంటును మీరే దగ్గరుండి కనిపెట్టుకోవలసి వస్తుంది. ఇంక చిన్నపిల్లలు వీళ్ళు మనతో బాటే ఉంటారు. ఎంచక్కా మన నెక్స్ట్ మజిలీ రూయా హాస్పిటలే గదండీ? ఎంతటి మహానుభావుడండీ రూయా? మన మిక్కడికి వచ్చి చేరతామని తెలియక మునుపే ఇక్కడ ఆసుపత్రి కట్టించే ఏర్పాటు చేశాడు...."

"ఎంతయినా ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు గావు" అంటూ రుసరుసలాడాడు సుందరం.

ఎంచినట్టుగా పదిహేను రోజులు గడిచిపోయాయి. మేడపైకి వెళ్లి కిటికి తలుపులు తెరిస్తే అంతులేని అందం. దిగివచ్చిన అలికిడి వినిపిస్తే రాజ్యం తెచ్చిపెట్టే సరిక్రొత్త సమస్య. ఆ రెండింటి మధ్య సుందరానికి ఒక రోజు గడిచినట్టుగా ఇంకొకరోజు గడవడం లేదు.

ఆ నెలలో రెండో శనివారం వచ్చింది. సుందరం తలంటిపోసుకున్నాడు. భోజనం చేసి నాలుగింటి దాకా నిద్రపోయాడు. టౌనులోకి బయల్దేరుతుండగా రాజ్యం పిలిచింది. "ఏమండీ! ఈ రోజు మీరు ఒక ప్రొద్దని మరచిపోకండి. మిగిలి ఉన్న అన్నం పిల్లలకి సరిపోతుంది. అగ్గిపెట్టె తీసుకొస్తేనే మనకు టిఫిను" అంటూ హెచ్చరించింది.

ఆరుగంటలకల్లా తిరిగి వచ్చేయాలన్న సదుద్దేశంతోనే సుందరం టౌనుకు బయల్దేరాడు. సహోద్యోగి ఒకతను కనిపించి బలవంతం చేయడంతో సినిమాకు వెళ్ళక తప్పింది గాదు. సినిమా పసందుగా ఉంది. తాత్కాలికంగా బాహ్యప్రపంచం మరపుకొచ్చింది. సినిమా తలపుల్లోనే మునిగితేలుతూ అతడు పదిగంట తర్వాత ఇల్లు చేరుకున్నాడు.

"కిటికీ తెరిచిపెట్టాను. హాయిగా ఈ మంచినీళ్ళు తాగిపడుకోండి" అంటూ టంబ్లరు నిండుకూ నీళ్ల తీసుకొచ్చింది రాజ్యం.

"అదేమిటి రాజ్యం! టిఫిను చెయ్యలేదా?" అన్నాడు సుందరం.

"ఆటవికులకు మల్లే అడవుల్లో బ్రతుకుతున్నాం సరే! కానీ చెకుముకి రాయితో నిప్పుచేయడం నాకు తెలిసి ఏడ్చిందా, ఏమన్నానా?"ముసుగు బిగదన్ని పడుకుంటూ అంది రాజ్యం.

సుందరానికి కోపం వచ్చింది. ఉక్రోషం హెచ్చింది. ఆకలితో పేగులు గీ పెడుతున్న కొద్దీ కుర్చీని ముక్కలు చేసి, టేబిలును బద్దలు గొట్టి ఏదైనా అఘాయిత్యం చేసెయ్యాలని అనిపిస్తూ ఉంది. టేబుల్ పైన తలవాల్చుకుని అరగంట సేపలాగే కుర్చీలో కూరాకు కాడలా సోలి ఉండిపోయాడు. చలి గాలికి నరాలు జివ్వుజివ్వు మనడంతో ఎక్కడ లేని చిరాకొచ్చింది. చెయ్యి సాచి ఫెడీల్, ఫెడీల్మని కిటికీ తలుపులు వేసేశాడు. వెక్కిరిస్తున్నట్టుగా వేసిన తలుపులు మళ్లీ తెరుచుకున్నాయి.

ఎట్ట యెదుట గాజుల చెయ్యి. ఆ చేతిలో ప్లేటు, అందులో అందుకు తగిన అనుపానంతో బాటుగా ఆరు పూరీలు...

తల పైకెత్తి చూచాడు సుందరం. ముసిముసి నవ్వులతో కనిపించింది రాజ్యం.

నీతో నాకేం పని లెమ్మన్నట్టు గబగబ ఒక పూరీ తిని, గ్రుక్క పట్టి ఒక లోటా నీళ్ళు తాగేశాడు సుందరం. "ఏమండీ! అలిపిరి కిప్పుడు ఒకటీ బై ఆరో వంతు (1/6) అందం వచ్చేసింది గదండీ" అంది రాజ్యం.

"తంతాను" అన్నాడు సుందరం. పిడికిలి బిగపట్టి.

"అప్పుడేనా! సగం అందమైనా రానివ్వండి" అంది రాజ్యం.

టిఫిను పూర్తయ్యే దాకా భార్యాభర్తల మధ్య మౌనమే తాండవించింది. చేయి కడుక్కున్నాక టవలు తీసుకొచ్చి ఇస్తూ "ఏమైనా ఆత్మపదార్థం కన్నా ఆహారపదార్థమే ముఖ్యమేమోనండీ? ఏమండీ! అగ్గిపెట్టె సులభంగా దొరికే చోటికి వెళ్ళిపోదామండీ" అంది గోముగా రాజ్యం.

"సర్లే, సర్లే" అంటూ తన స్థానాన్ని కుర్చీపై నుంచి పడకపైకి మార్చుకున్నాడు సుందరం.

**(పాంథశాల కథా సంపుటి నుంచి)**

## నీమ్ మ్యాట్స్‌తో ఎక్కడి దోమలక్కడ గప్‌చుప్!

ఉండ నాలుకకి మందేస్తే కొండనాలుక ఊడిందన్న సామెతగా ఒంట్లో రక్తాన్ని పీలుస్తూ, సూదుల్లా పొడుస్తున్న దోమల బాధనుండి బయటపడటానికి వాడే రకరకాల రిపెల్లెంట్స్ అన్నీ ఇతరత్రా ఇబ్బందుల్ని 'కొని'తెచ్చిపెట్టేవే! అందుకే వీటికంటే వేపతల్లిని నమ్ముకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం. వంద గ్రాముల కొబ్బరి లేక ఆవనూనెలో రెండు గ్రాముల వేపనూనెను కలిపి పడుకోబోయేముందు ఒంటికి రాసుకుంటే దోమలు మీ దరిచేరవు. లేదా...

వంద గ్రాముల కొబ్బరి నూనెలో గాని, ఆవనూనెలోగాని ఐదు గ్రాముల వేపనూనెను కలిపి, ఈ మిశ్రమంలో వాడేసిన మ్యాట్స్(కార్డ్‌బోర్డ్ ముక్కలు)నుగాని ముంచి ఎండబెట్టి మస్కిటో మ్యాట్స్‌కింద వాడుకుంటే ఎక్కడి దోమలక్కడ ఖరార్! ఇక రాత్రంతా హాయిగా నిద్రపోవచ్చు.